క్లుప్తంగా

ఉచిత రక్తదాన శిబిరం



నీలాద్రిరావుపేటలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మణరావు

గండేపల్లి: యువత చేసే రక్తదానం ఆపదలో ఉన్నవారికి ప్రాణదానంతో సమానమని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేట యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. జెడ్.రాగంపేట, తాళ్లూరు, జగ్గంపేట తదితర గ్రామాలకు చెందిన యువకులు రక్తదానం చేసినట్టు గ్రామ యూత్ సభ్యులు తెలిపారు. కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ వైద్యులు పి.కామరాజు, సిబ్బంది రక్తాన్ని సేకరించారు.

తాగునీరు వృథా



ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఏలేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ప్రధాన పైపు లైన్ దెబ్బతినడంతో కొద్దిరోజులుగా తాగునీరు వృథా అవుతోంది. దీనిపై మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్యాంకుల నుంచి రోజుల తరబడి తాగునీరు వృథాపోతున్న అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బీవీపీ సేవలు విస్తరించాలి



బీవీపీ రాష్ట్ర ప్రతినిధులను సత్కరిస్తున్న తుని సభ్యులు

తుని: భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) సేవలను మరింత విస్తరించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాతీయ బీవీపీ చైర్మన్ ధూళిపాల పురుషోత్తమశాస్త్రి అన్నారు. స్థానిక బీవీపీ అధ్యక్షుడు పి.లక్ష్మణాచార్యులు అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీవీపీ 61 సంవత్సరాల మహావట వృక్షాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీవీపీ సౌత్ రీజియన్ సేవా ప్రముఖులు ఎంతః సూర్యనారాయణరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు, వికలాంగ సహాయత యోజనలోని అన్ని సేవా సంస్థలకు బీవీపీ ఆదర్శనీయమన్నారు. బీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు సన్యాసిరాజు మాట్లాడుతూ బీవీపీ సేవలు మరింత విస్తృత పరిచేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీవీపీ రాష్ట్ర కన్వీనర్ ఆంజనేయప్రసాద్, రాష్ట్ర సభ్యులు చదరం శివాజీ, ఆశిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో బీజేపీ నేతల సమావేశం

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో మరోసారి బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ కాకినాడ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంద వీరాస్వామి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, జిల్లా కమిటీ సభ్యుడు గున్నాబత్తుల రాజబాబు, మండల ఉపాధ్యక్షుడు ఇంటి బాబూరావు, మాగపు శివ సత్యనారాయణ దశం మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వాకపల్లి, పోతులూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కిసాన్ సెల్ కో ఆర్డినేటర్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ నెల 9న తునిలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొయ్యేటి సూర్య ప్రకాష్ రావు, కొల్లు వీర గణేష్, కొప్పన కోటేశ్వరరావు, ఏనుమల రాజా, దిడ్డి రాజబాబు, పోతాబత్తులు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే..

- స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్న పల్లెలు
- సత్ఫలితాలిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం
- పంచాయతీలకు అదనపు ఆదాయం



బిళ్లనందూరు సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత వైపు అడుగులు వేస్తోంది. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గ్రామాలను వ్యర్థ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతోంది. శానిటేషన్ మెరుగుపరిచి వ్యాధులను తరిమికొట్టడం, పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చడం ద్వారా పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ప్రతి పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా పల్లెల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణ, ఆహ్లాదకర వాతావరణంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూరుతోంది. చెత్త నుంచి సంపద కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చింది. ఈ కేంద్రాల వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించి వాటి సమగ్ర నిర్వహణ ద్వారా పల్లెల స్వరూపాన్నే మార్చేసింది.

మూడు నియోజకవర్గాల్లో 200 సంపద కేంద్రాలు

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సుమారుగా 200 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ విధిగా ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి సంపద కేంద్రాల వద్ద నిల్వ చేస్తారు. పొడి చెత్తను రీసైకిల్ చేసి వ్యాపారులకు అమ్మడం, తడి చెత్తను ఆరుబయట ఆరబెట్టడం చేస్తారు. తడి చెత్త ఆరిన తరువాత సంపద కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గుంతల్లో నిల్వ చేసి వాటిలో వానపాములు వేసి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన కంపోస్టు ఎరువును స్వల్ప ధరకు రైతులకు విక్రయించి ఒకవైపు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ మరోవైపు పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. ఈ కేంద్రాల నిర్వహణకు ప్రత్యేకంగా గ్రీన్ అంబాసిడార్లను ఏర్పాటు చేసి వారికి తరచూ శిక్షణ ఇస్తున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నిధులను ఖర్చు చేస్తున్నారు.

వివిధ రూపాల్లో పారిశుధ్య నిర్వహణ

ప్రభుత్వం పల్లెల్లో పారిశుధ్య నిర్వహణను వివిధ రూపాల్లో చేపడుతోంది. చెత్త సేకరణ రిక్షాలు, ట్రాక్టర్లు, పవర్ ఆటోల ద్వారా చెత్తను సేకరించడం, ఫాగింగ్ మెషీన్లు, హైపర్ టాయిలెట్ క్లీనర్లతో క్రిమి కీటకాలు, దోమలను నాశనం చేయడం ద్వారా చాలా వరకూ వ్యాధులను నివారించారు. గతానికి భిన్నంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. విస్తృతంగా మొక్కలను సైతం నాటి పల్లెలను పర్యావరణ హితంగా మారుస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగం

గత ప్రభుత్వంలో సంపద కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. అయితే ప్రతి మండలంలో ఒకటో, రెండో కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లుగా భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. ఈ కేంద్రాల ప్రాధాన్యతను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసి సందప క్రేందాలను ప్రాధాన్యత క్రమంలో వినియోగంలోకి తీసుకొచ్చింది.

పారిశుధ్య నిర్వహణ బాగుంది



పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ బాగుంది. గ్రీన్ అంబాసిడర్లు విధిగా రోజూ ఇళ్ల నుంచి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. గతంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, మురుగు దర్శనమిచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండడంతో పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ప్రజారోగ్యం కూడా మెరుగుపడింది.

– గిడుతూరి రాంబాబు, టీజే నగరం

సంపద కేంద్రాల నిర్వహణ భేష్



పల్లెల్లో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరుగుతోంది. ప్రత్యేక శిక్షణ పొందిన గ్రీన్ అంబాసిడర్లు చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీ, ఫాగింగ్, దోమల మందు పిచికారీ వంటి కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తున్నారు. సంపద కేంద్రాల ద్వారా పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతుంది. పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి.

– జి.అరుణ్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారి, కోటనందూరు

ఎలుకల సామూహిక నివారణతో అధిక దిగుబడులు



తేటగుంటలో ఎలుకల సామూహిక నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తుని రూరల్: రైతులు ఎలుకల సామూహిక నివారణ చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని తేటగుంటలో సామూహిక ఎలుకల నివారణ, ఎర తయారీపై ఆదివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎలుకలు అన్ని ప్రాంతాల్లో ఉన్నాయని, వాటిని సమూలంగా నిర్మూలించినప్పుడే పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. అందుకు రైతులంతా ఉద్యమంలా ఎలుకల నివారణకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన బ్రోమోడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేశారు. విషపు ఎర తయారీపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. హెక్టారుకు పది గ్రాముల బ్రోమోడయోలిన్ మందును వాడాలని సూచించారు. పది గ్రాములు చొప్పున ఎరను పొట్లాలు చుట్టీ బొరియల్లో ఉంచడం ద్వారా ఎలుకలను నివారించవచ్చని తెలిపారు. ఏఈఓ పి.జగ్గఅప్పారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ



లింగంపర్తిలో అనంతబాబు, వరుపులను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- ఎమ్మెల్సీ అనంతబాబు, ఆ పార్టీ కో ఆర్డినేటర్ వరుపుల
- వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల నుంచి విశేష ప్రజాదరణ ఉందని ఎమ్మెల్యే అనంత ఉదయభాస్కర్, ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో వరుపుల ఇంటి వద్ద ఆదివారం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వందలాది మంది వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారికి అనంతబాబు, వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం అనంతబాబు, వరుపులను పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడు దో చిట్టిబాబు, వరుపుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

రౌతులపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఎస్ఎన్ పట్నం, ఎస్‌వీ నగరం, లచ్చిరెడ్డి పాలెం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కుల, మత, వర్గ, రాజకీయ తారతమ్యాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నవరం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ వాసిరెడ్డి జమీలు, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఎస్ఎన్ పట్నం సర్పంచ్ సింగపల్లి వెంకటలక్ష్మి, చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మేడపురెడ్డి రమణమ్మ, లాలం గోవిందు, గొర్లె శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత



విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరికి పింఛను అందిస్తున్న వలంటీరు గంగాధర్

తుని: సర్జరీ చేయించుకొని విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు ఆదివారం వలంటీరు పింఛను అందజేశాడు. స్థానిక 15వ వార్డు దుర్గాదాసువీధికి చెందిన సరిపల్లి హరి అనే మహిళ విజయవాడలో ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె సామాజిక పింఛను లబ్ధిదారు కావడంతో వార్డు కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ ఆదేశాల మేరకు వలంటీరు కేవీ గంగాధర్ సొంత ఖర్చులతో విజయవాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. వలంటీర్ గంగాధర్‌ను పలువురు అధికారులు అభినందించారు.

తవ్వారు.. వదిలేశారు..

కిర్లంపూడి: మండల పరిధిలోని చిల్లంగి నుంచి గెద్దనాపల్లి వెళ్లే రహదారికి మధ్యలో రోడ్డుకు ఇరువైపులా భారీ గోతులు తవ్వి వదిలివేశారు. ఎగువ పొలాల నుంచి దిగుడు కాలువకు నీరు పోవటానికి రోడ్డు అడుగు భాగాన తూర ఉండేది. అది వాడకంలో లేకపోవడంతో రోడ్డు కింద మట్టిలో కూరుకుపోయింది. దీంతో పంట పొలాల రైతులు తూరను వెలికి తీసేందుకు రోడ్డుకు ఇరువైపులా గొయ్యి తవ్వి వదిలేశారు. దీంతో వాహనదారులు ఆ దారిన వెళ్లేందుకు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గొయ్యి

జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం
- జెడ్.రాగంపేటలో ఆత్మీయ సమావేశం



జెడ్.రాగంపేటలో తోట నరసింహం, తోట రాంజీలను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గండేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. మండలంలోని జెడ్.రాగంపేటలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన జేసీఎస్ గ్రామ కన్వీనర్ పాలచర్ల వెంకన్న చౌదరి (గోకవరం చౌదరి) ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. ఒత్తిళ్లకు లొంగకుండా పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ నేతలు తోట నరసింహం, అతని కుమారుడు తోట రాంజీలను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా ఏడుకొండలు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ గఫూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మూర్తి, నీలాద్రిరావుపేట సర్పంచ్ సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒబిణ్ని సత్యనారాయణ, పార్టీ నేతలు తులా రాము, పరమి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న నియోజకవర్గ తోట నరసింహం

ఘనంగా తండులార్చన



ప్రత్తిపాడు శ్రీసత్యసాయి గాయత్రి తండులార్చన చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: స్థానిక సత్యసాయి సేవా కేంద్ర భవన్‌లో ఆదివారం ఘనంగా శ్రీసత్యసాయి గాయత్రి తండులార్చన (బియ్యంతో అర్చన) నిర్వహించారు. బాలబాలికలు, తల్లిదండ్రులు, సమితి సభ్యులు శ్రీసాయి గాయత్రి మంత్రాన్ని పటిస్తూ తండ్రులార్చన చేశారు. బాలవికాస్ విద్యార్థిని స్వాతి గనిలక్ష్మి గాయత్రి మంత్రం విశిష్టతను వివరించింది. అనంతరం ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో జిల్లా బాలవికాస్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా విద్యాజ్యోతి కో ఆర్డినేటర్ సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

టీడీపీ పాదయాత్ర

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురం నుంచి రమణయ్యపేట వరకు ఆదివారం టీడీపీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల సత్యప్రభ పార్టీశ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అధ్వానంగా ఉన్న రహదారులను పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శ్రీకారం చుట్టారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. మర్రిపాక–ఇర్రిపాక రోడ్డు నిర్మాణ పనులకు సంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 6 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఇర్రిపాక సర్పంచ్ తిర్రిదేవి, వైఎస్సార్ సీపీ నేతలు జ్యోతుల రామస్వామి, వత్సవాయి సత్యనారాయణరాజు, గణేశుల రాంబాబు, వంటిపల్లి రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.



రామవరం వద్ద రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

టీటీడీ చైర్మన్‌కు తపోవనం స్వామీజీ ఆశీస్సులు

తుని రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ భూమాన కరుణాకర్‌రెడ్డిని మండలంలోని కుమ్మరిలోవలో తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆదివారం ఆశీర్వదించారు. ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ తిరుమలలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర ధార్మిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీ పాల్గొని ధర్మ ప్రచారంపై విస్తృతంగా చర్చలు నిర్వహించినట్టు తపోవనం పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి వేదాశీస్సులు అందజేసినట్టు స్వామీజీ పేర్కొన్నారు.



టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందిస్తున్న తపోవనం పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

కత్తి పద్మారావుపై కఠిన చర్యలు తీసుకోవాలి



గోకవరంలో ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న హిందూ ధార్మిక సంఘాల సభ్యులు

గోకవరం: సీతారాములపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కత్తి పద్మారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు హిందూ ధార్మిక సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. పద్మారావు వ్యాఖ్యలకు నిరసనగా హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దేవీచౌక్ ఆలయం నుంచి హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి కత్తి పద్మారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకుడు వరసాల ప్రసాద్ మాట్లాడుతూ హిందువులు దైవంగా భావించే సీతారాములపై కత్తి పద్మారావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడిన పద్మారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. అనంతరం వారు జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్సై కె.నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ రామసేన, విశ్వహిందూ పరిషత్, సనాతన ధర్మ ప్రబోధన సమితి సభ్యులు పాల్గొన్నారు.